సాక్షి
నారాయణపేట
ఆదివారం । 11 । జూన్ । 2023



మతసామరస్యానికి ప్రతీక

మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే షాఅలీ పహిల్వాన్ ఉర్సు ఆదివారం ప్రారంభం కానుంది.

వివరాలు 8లో ▶



విద్వేషాలతో చిన్నాభిన్నం

రాజకీయాలు విద్వేషంగా మారుతూ వ్యవస్థలను చిన్నాభిన్నం చేస్తున్నాయని హరగోపాల్ అన్నారు.

వివరాలు 10లో ▶

గరిష్టం/కనిష్టం
38.7 /22.1

వాతావరణం

ఉదయం నుంచి ఎండ తీవ్రత ఉంటుంది. అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతమై వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

తెలంగాణ రన్ విజయవంతం చేద్దాం

● ఎస్పీ ఎన్.వెంకటేశ్వర్లు

నారాయణపేట రూరల్: దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేద్దామని ఎస్పీ ఎన్.వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 22 వరకు జరిగే వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు. జూన్ 4న పోలీసుశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సురక్ష పోలీసు ఉత్సవం విజయవంతమైందన్నారు. ఆదేవిధంగా 12న ఉదయం 6 గంటలకు నిర్వహించే తెలంగాణ రన్‌లో పోలీసులు అధికసంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ ఉదయం 5.30 గంటలకే పరేడ్ గ్రౌండ్‌కు చేరుకోవాలని, క్యాప్, టీషర్టు ఉచితంగా ఇస్తామన్నారు. తప్పకుండా బూట్లు వేసుకుని రావాలని సూచించారు.

పరేడ్‌తో శారీరక దృఢత్వం



నారాయణపేట రూరల్: పోలీసులు వీక్లి పరేడ్‌లో భాగస్వాములు కావాలని అడిషనల్ ఎస్పీ నాగేంద్రుడు కోరారు. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయ మైదానంలో శనివారం ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసులు వీక్లి పరేడ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి పోలీసు రోజు వ్యాయామం చేయాలని, వారానికి ఒకసారి పరేడ్ నిర్వహించడంతో శారీరక దృఢత్వాన్ని పొందవచ్చన్నారు. అదేవిధంగా పోలీసులు ఉపయోగించే ఆయుధాలపై అవగాహన కల్పించారు. సమయపాలన, క్రమశిక్షణ అలవాటు చేసుకోవాలని సూచించారు. సర్వీసులో ఏమైన సమస్యలుంటే ఎస్పీని కలిసి పరిష్కరించుకోవాలన్నారు. అంతకుముందు గౌరవ వందనం స్వీకరించారు. ఆర్ఐ విజయ్‌కుమార్, ఇందిర, సర్కిల్ రిజర్వుడ్, జిల్లా పోలీసులు పాల్గొన్నారు.

సీఎన్ఆర్ కళాశాలకు న్యాక్ గుర్తింపు

నారాయణపేట రూరల్: జిల్లాకేంద్రంలోని చిట్టెం నర్సిరెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు న్యాక్ గుర్తింపులో బి+ గ్రేడ్ వచ్చిందని ప్రిన్సిపాల్ రంగారెడ్డి, ఇన్‌చార్జ్ నారాయణగౌడ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రైవేట్ కళాశాలగా ఆవిర్భవించి ఎయిడెడ్‌గా రూపాంతరం చెంది తుదకు ప్రభుత్వపరమై అతి తక్కువ కాలంలో న్యాక్ గుర్తింపు సాధించడం ఆనందంగా ఉందని, అందరి కృషి, సహకారంతో సాధించిన విజయమని పేర్కొన్నారు.

14న పాలిసెట్ విద్యార్థులకు అవగాహన

పెబ్బేరు: పాలిసెట్‌లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఈ నెల 14న కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఏకే శ్రీకాంత్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023లో అర్హత సాధించిన విద్యార్థులు కౌన్సిలింగ్ కోసం ఆన్‌లైన్‌లో స్లాట్ బుకింగ్, రిజిస్ట్రేషన్, సర్టిఫికెట్ వెరిఫికేషన్, సీట్ అలాట్‌మెంట్, కోర్సుల వివరాలు, ప్రయోగశాలలు, బోధన సిబ్బంది, వసతులు, హాస్టల్ గురించి తెలుసుకోవాలని సూచించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు విధిగా హాజరుకావాలని కోరారు. మరిన్ని వివరాలకు దశరథ్‌నాయక్ (సెల్‌నంబర్ 91105 32218), తిరుపతి చౌహాన్ (88868 66787), క్రాంతి (98854 95436), చిన్నబాబు (63003 459710) సంప్రదించాలని సూచించారు.

జలాశయాలపై అలసత్వం!

- మూడేళ్లుగా నత్తనడకన సా..గుతున్న గుర్రంగడ్డ కాజ్‌వే బ్రిడ్జి
- 2018లో సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేసిన గట్టుదీ అదే దారి
- పీజేపీ కుడి ప్రధాన కాల్వపై పూర్తికాని బ్రిడ్జిల నిర్మాణం
- ర్యాలంపాడు లీకేజీలపై ఉలుకుపలుకు లేని ప్రభుత్వం
- రేపు గద్వాలలో పర్యటించనున్న ముఖ్యమంత్రి కేసీఆర్

గద్వాల రూరల్: జిల్లాలోని ఇరిగేషన్ శాఖ పరిధిలో పలు ప్రాజెక్టుల పనులు నత్తనడక నేర్చుతున్నాయి. ప్రధానంగా నడిగడ్డకు కల్పతరువుగా పేరుగాంచిన నెట్టెంపాడు ప్రాజెక్టు పనులు 18 ఏళ్లు గడిచినా పనులు మాత్రం అసంపూర్తిగానే ఉన్నాయి. అలాగే ఆర్డీఎస్ కింద ఉన్న సాగునీరందని ఆయకట్టుకు పూర్తిస్థాయిలో నీరందించే లక్ష్యంతో ఐదేళ్ల కిందట సీఎం కేసీఆర్ చేత ప్రారంభమైన తుమ్మిళ్ల ఎత్తిపోతలు మొదటి పంపుకే పరిమితమైంది. దివిగ్రామమైన గుర్రంగడ్డ ప్రజల చిరకాల కోరిక కాజ్‌వే బ్రిడ్జి మూడేళ్లుగా ముందుకు సాగడం లేదు. బీటలు పడిన ర్యాలంపాడు రిజర్వాయర్‌కు మరమ్మతుకు నోచుకోవడం లేదు. జూరాల ప్రాజెక్టు కుడి కాలువపై నిర్మించిన బ్రిడ్జిలు శిథిలావస్థకు చేరుకుని కూలిపోతున్న వాటిస్థానంలో కొత్తవి నిర్మించేందుకు మీనమేషాలు లెక్కిస్తున్నారు. గట్టు ఎత్తిపోతల పనులు సైతం ముందుకు సాగడం లేదు. ఈ క్రమంలో సీఎం కేసీఆర్ సోమవారం జిల్లా పర్యటన నేపథ్యంలో ఆయా ప్రాజెక్టుల పరిస్థితిపై ప్రత్యేక కథనం..

18 ఏళ్లుగా పూర్తి కాని నెట్టెంపాడు ప్రాజెక్టు పనులు



99వ ప్యాకేజీ కింద అసంపూర్తిగా తవ్వేసిన కాల్వలో మొలకెత్తిన పిచ్చిమొక్కలు

సాక్షి ఫోకస్

తుమ్మిళ్ల ఎత్తిపోతలు..

ఆర్డీఎస్ కింద రూ.783 కోట్ల పరిపాలన అనుమతులతో తుమ్మిళ్ల ఎత్తిపోతలు చేపట్టారు. అయితే పనులు ప్రారంభంలో కనిపించిన హడావుడి తర్వాత కొరవడింది. మొదటి దశ కింద రూ.397 కోట్లతో మొదలుపెట్టిన పనుల్లో కేవలం రూ.153 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. రెండో పంపునకు సంబంధించి సుమారు రూ.2 కోట్ల పనులు అసంపూర్తిగా ఉన్నాయి. ఐదేళ్ల కిందట స్వయంగా సీఎం కేసీఆర్ మొదటి పంపు పనులు పూర్తి చేసి నీటిని విడుదల చేయగా తర్వాత రెండో పంపు పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. దాని కింద నిర్మించాల్సిన రిజర్వాయర్లకు సంబంధించి ఇంకా ప్రతిపాదన దశలోనే ఉన్నాయి. ఈ పనులు పూర్తయితే రెండు సీజన్లలో ఆర్డీఎస్ కింద 55 వేల ఎకరాలకు పూర్తిస్థాయిలో సాగునీరందుతుంది.



తుమ్మిళ్ల ఎత్తిపోతలు



గద్వాల సమీపంలో శిథిలావస్థకు చేరుకున్న బ్రిడ్జి, అసంపూర్తిగా కొత్త బ్రిడ్జి పనులు

18 ఏళ్లుగా పూర్తికాలే..

జలయజ్ఞంలో భాగంగా అప్పటి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 2 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు నెట్టెంపాడు ప్రాజెక్టు చేపట్టారు. వైఎస్సార్ హయాంలోనే 70 శాతం పనులు పూర్తయ్యాయి. అయితే తర్వాతి కాలంలో నెట్టెంపాడు ప్రాజెక్టుకు గ్రహణం పట్టింది. 18 ఏళ్ల కిందట మొదలుపెట్టిన ఈ పనులు ఇప్పటికీ సా..గుతూనే ఉన్నాయి. 14 ప్యాకేజీలుగా విభజించి చేపట్టిన పనుల్లో ప్రధానంగా 99, 100 ప్యాకేజీలకు సంబంధించి కాంట్రాక్టర్లు పనులను మధ్యలోనే వదిలేశారు. కొత్త కాంట్రాక్టర్లకు పనులు అప్పగించినా కొద్దిమేర పనులు కూడా పూర్తిచేయలేకపోతున్నారు. మరోవైపు ఈ ప్రాజెక్టు కింద ఇంకా 622 ఎకరాలు భూమి సేకరించాల్సి ఉండగా.. 99, 100 ప్యాకేజీల కింద సుమారు వంద ఎకరాలకు పైనే భూ సేకరణ జరగాలి. ఈ రెండు ప్యాకేజీల పనులను పూర్తి చేస్తే మరో 50 వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. అలాగే సంగాల, చిన్నోనిపల్లి రిజర్వాయర్ల పరిధిలో సుమారు రూ.10 కోట్ల పనులు చేయాల్సి ఉంది.

నత్తనడకన గట్టు ఎత్తిపోతలు..

ఆసియా ఖండంలోనే వెనకబడిన ప్రాంతంగా పేరుగాంచిన గట్టు మండలంలోని 33 వేల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో 2018లో సీఎం కేసీఆర్ గట్టు ఎత్తిపోతలకు శంకుస్థాపన చేశారు. అయితే అనేక మార్లు డీపీఆర్ నివేదికలు మార్పులు చేసుకున్న అనంతరం ఎట్టకేలకు 2.80 టీఎంల సామర్థ్యంతో రాయపురం వద్ద రూ.581 కోట్లతో గట్టు ఎత్తిపోతలు నిర్మించేందుకు తుది డీపీఆర్‌ను రూపొందించి ప్రభుత్వం సైతం పరిపాలన అనుమతులు ఇచ్చింది. ఇందుకు సంబంధించి గతేడాది 2022 జూలైలో టెండర్, అగ్రిమెంట్ ప్రక్రియలు పూర్తయినా.. పనులు మాత్రం 15 శాతమే పూర్తయ్యాయి. దీనికి సంబంధించి ప్రధానంగా భూసేకరణ అడ్డంకిగా మారింది. ఇక పూర్తయిన 15 శాతం పనులకు సంబంధించి సుమారు రూ.30 కోట్లకు పైనే బిల్లులు రావాల్సి ఉంది.

వేగవంతంగా పనులు..

నెట్టెంపాడుకు సంబంధించి 99, 100 ప్యాకేజీల పనులు పూర్తయితే 50 వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. తుమ్మిళ్లలో చిన్న చిన్న పనులు పూర్తి చేస్తాం. అలాగే రిజర్వాయర్ల నిర్మాణాలకు సంబంధించిన ప్రక్రియ రెవెన్యూశాఖ పరిధిలో పురోగతిలో ఉంది. గుర్రంగడ్డ బ్రిడ్జి సైతం త్వరగా పూర్తి చేసేలా చూస్తాం. ర్యాలంపాడు మరమ్మతుకు సంబంధించి రూ.147 కోట్లతో నివేదిక సిద్ధం చేసి సీఈకి పంపాం. ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చిన వెంటనే పనులు మొదలు పెడతాం. జూరాల కుడికాల్వపై బ్రిడ్జిలను త్వరగా పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటాం.

– శ్రీనివాస్‌రావు, ఇరిగేషన్‌శాఖ ఎస్ఈ

దివిగ్రామం కష్టాలు తీరేనా?

దివిగ్రామంగా పేరుగాంచిన గుర్రంగడ్డ కాజ్‌వే నిర్మాణం మూడేళ్లుగా మూడడుగులు ముందుకు.. ఆరడుగులు వెనక్కి అన్న చందంగా సాగుతోంది. మొత్తం 850 మీటర్ల పొడవున్న కాజ్‌వే నిర్మాణం రూ.11 కోట్లతో చేపట్టారు. పనులకు సంబంధించి టెండర్లు, అగ్రిమెంట్ 2020లోనే పూర్తి కాగా.. ఇప్పటి వరకు రూ.2.50 కోట్ల పనులు మాత్రమే జరగడం గమనార్హం. సదరు కాంట్రాక్టర్‌కు ఇప్పటికే పలుమార్లు నోటీసులు ఇచ్చినా పనుల్లో పురోగతి కనిపించడం లేదు.



ఏళ్లతరబడిగా సాగుతున్న గుర్రంగడ్డ వాక్‌వే బ్రిడ్జి పనులు

లీకేజీలకు మరమ్మతులేవీ?



ర్యాలంపాడు రిజర్వాయర్‌కు ఏర్పడిన లీకేజీలు

నెట్టెంపాడు ఎత్తిపోతలలో భాగంగా నిర్మించిన ర్యాలంపాడు రిజర్వాయర్‌కు రెండేళ్ల కిందట లీకేజీలు ఏర్పడ్డాయి. రిజర్వాయర్ అడుగు భాగంలో లీకేజీ రూపంలో పెద్దఎత్తున నీరు బయటకు వస్తుండడంతో ఆనకట్ట ఉనికికే ప్రమాదం ఏర్పడింది. దీంతో మొత్తం రిజర్వాయర్ సామర్థ్యం 4 టీఎంసీలు కాగా కేవలం 2 టీఎంసీలు మాత్రమే నిల్వ ఉంచుతున్నారు. అయితే ఈ లీకేజీలకు మరమ్మతు చేసేందుకు హైదరాబాద్‌కు చెందిన ప్రైవేటు సంస్థకు సర్వే పనులు అప్పగించగా గతేడాది డిసెంబర్‌లో సమగ్ర నివేదిక ఇరిగేషన్ శాఖకు అందించింది. ఇందుకోసం రూ.150 కోట్ల వ్యయం అవుతుందని నివేదికలో పేర్కొన్నారు. అయితే దీనిపై ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదు.

బ్రిడ్జిలకు మోక్షమెప్పుడో..

జూరాల నిర్మించిన కొత్తలో ప్రాజెక్టు కుడి ప్రధాన కాల్వపై ధరూరు, గద్వాల, ఇటిక్యాల మండలాల పరిధిలో పలుచోట్ల బ్రిడ్జిలను నిర్మించారు. అయితే వీటిలో చాలా వరకు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఇందులో గతేడాది ధరూరు మండలం భీంపురం వద్ద బ్రిడ్జి కూలిపోగా.. గద్వాలలోని నదిఅగ్రహారం వెళ్లే రహదారి మార్గంలోని బ్రిడ్జి, బీరెల్లి వెంకంపేటకు వెళ్లే మార్గంలోని బ్రిడ్జి, జమ్ములమ్మ రిజర్వాయర్ సమీపంలోని బ్రిడ్జిలు శిథిలావస్థకు చేరుకున్నాయి.

❒ వీటిస్థానంలో కొత్తగా బ్రిడ్జిలు నిర్మించేందుకు ప్రభుత్వం రూ.2.05 కోట్లు విడుదల చేసింది. ఇందులో ధరూరు మండలం భీంపురం వద్ద ఉన్న బ్రిడ్జి మాత్రమే పూర్తి కాగా మిగిలిన రెండు బ్రిడ్జిల నిర్మాణాలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న తరహాలో ఉన్నాయి. అయితే పనులు దక్కించుకున్నది ముఖ్యనేత కావడంతో అధికారులు ఏమనలేని దుస్థితి. ఈ రెండు చోట్ల ఉన్న పాత బ్రిడ్జిలు శిథిలావస్థకు చేరుకుని కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి.

పారదర్శకంగా ఓటరు నమోదు

కలెక్టర్ శ్రీహర్ష



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీహర్ష

నారాయణపేట రూరల్: జిల్లాలోని బూత్‌స్థాయి అధికారులు ఇంటింటి సర్వే చేపట్టి ఓటరు నమోదు ప్రక్రియ పారదర్శకంగా చేపట్టాలని కలెక్టర్ శ్రీహర్ష అన్నారు. స్థానిక జిల్లా పాలనాధికారి కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అక్టోబర్ 1 నాటికి 18 ఏళ్లు నిండే ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించాలన్నారు. రోజు 20 నుంచి 30 ఇళ్ల సర్వే చేపట్టాలని.. అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా మే 25 నుంచి జూన్ 23 వరకు జాబితా ప్రత్యేక సవరణకు అవకాశం కల్పించిందని, త్వరలో ప్రత్యేక సమీక్ష ఉంటుందని వివరించారు. ప్రతి ఒక్కరి పుట్టిన తేదీని తిరిగి పరిశీలించాలని, ఫారం-6 పూర్తి చేసే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఒక ఇంట్లో ఆరు కంటె ఎక్కువ ఓట్లు ఉంటే తప్పకుండా ధ్రువీకరించుకోవాలన్నారు. పెండింగ్ దరఖాస్తులను వెంటనే పూర్తి చేయాలని కోరారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ మయాంక్ మిత్తల్, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.



హాజరైన అధికారులు

గ్రూప్-1 పరీక్షకు ఏర్పాట్లు పూర్తి



సీఎస్ఆర్‌డీసీని పరిశీలిస్తున్న అధికారులు

నారాయణపేట రూరల్: జిల్లాకేంద్రంలో ఆదివారం జరిగే గ్రూప్-1 పరీక్ష నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. శనివారం పరీక్ష కేంద్రాలను కలెక్టర్ శ్రీహర్ష, అడిషనల్ కలెక్టర్ మయాంక్ మిత్తల్, ఎస్పీ ఎస్.వెంకటేశ్వర్లు పరిశీలించి పలు సూచనలు చేశారు. జిల్లాలో 2,132 అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా.. పట్టణంలో ఏడు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. కేంద్రాల్లో మౌలిక వసతులు, సరిపడా సిబ్బందిని కేటాయించారు. 70 మంది పోలీసులు విధుల్లో పాల్గొననుండగా.. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉండనుంది. పరీక్ష సమయంలో అన్ని జిరాక్స్ కేంద్రాలు మూసివేయాలని అధికారులు ఆదేశాలు జారీచేశారు. ఉదయం 10.30 గంటలకు పరీక్ష ప్రారంభం కానుందని.. అభ్యర్థులను ఉదయం 8.30 నుంచి 10.15 వరకే లోనికి అనుమతించనున్నట్లు తెలిపారు. అవసరమైన గుర్తింపు కార్డులు వెంట తీసుకురావాలని సూచించారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి

ధన్వాడ: గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే ఎస్.రాజేందర్ రెడ్డి అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం మండలంలోని ఎమ్మినోనిపల్లి, మంత్రోనిపల్లి, రాంకిష్టాయపల్లి, చర్లపల్లి, జయరాంతండా, బుడ్డమర్రితండా, కొండాపూర్‌లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అలాగే లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను పంపిణీ చేసి మాట్లాడారు. రాయితీ గొర్రెలను విక్రయించరాదని.. ఒకవేళ అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దేశంలో ఇప్పటి వరకు మన రాష్ట్రంలోనే నిరంతర ఉచిత విద్యుత్ అందిస్తున్నామని.. ఈ ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు వాహిద్, ఎంపీపీ పద్మిబాయి, వైస్ ఎంపీపీ రాజేందర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు సుధీర్‌కుమార్, పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, యువజన సంఘం అధ్యక్షుడు సునీల్‌కుమార్‌రెడ్డి, మురళీధర్‌రెడ్డి, సచిన్, శ్రీనివాస్‌గౌడ్, చంద్రశేఖర్, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మినోనిపల్లిలో శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి

వేసవి శిబిరాలు ఉపయోగకరం

జిల్లా విద్యాధికారి రవీందర్



విద్యార్థులు తయారు చేసిన వస్తువులను పరిశీలించి అభినందిస్తున్న డీఈఓ రవీందర్

ధన్వాడ: వేసవి సెలవుల్లో విద్యార్థుల కోసం నిర్వహించిన వేసవి శిబిరాలు విద్యార్థులకు ఎంతగానో ఉపకరిస్తాయని జిల్లా విద్యాధికారి రవీందర్ అన్నారు. శనివారం మండలంలోని మండలిపల్లితండాలో వేసవి శిబిరం ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కలెక్టర్ ప్రత్యేక చొరవతో రూపొందించిన కార్యక్రమం 20 రోజుల పాటు కొనసాగిందని.. బోధించేందుకు యువకులు ముందుకురావడం అభినందనీయమని కొనియాడారు. శిబిరంలో విద్యార్థులు నేర్చుకున్న పలు కృత్యాలను పరిశీలించారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా జిల్లాలో ఈ కార్యక్రమం నిర్వహించినందుకుగాను కలెక్టర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ మాధవి, కో-ఆర్డినేటర్ రమేష్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

రాజీయే రాజమార్గం

జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి మహ్మద్ అబ్దుల్

నారాయణపేట రూరల్: రాజీయే రాజమార్గమని.. లోక్ అదాలత్‌లో కక్షిదారులు తమ కేసులు పరిష్కరించుకోవాలని జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి మహ్మద్ అబ్దుల్ రఫీ కోరారు. శనివారం కోర్టు ఆవరణలో జరిగిన లోక్ అదాలత్‌ను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. కక్షిదారులు చిన్న చిన్న తగాదాలతో కోర్టులను ఆశ్రయించి తమ సమయాన్ని వృథా చేసుకోవద్దని.. రాజీ కుదుర్చుకొని ప్రశాంత వాతావరణంలో జీవించాలని సూచించారు. మొత్తం అయిదు బెంచీలు ఏర్పాటుచేసి 189 కేసులు పరిష్కరించామని తెలిపారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు శ్రీనివాస్, మహ్మద్ ఉమర్, సయ్యద్ జకీయ సుల్తానా, పీపీ సురేష్‌కుమార్, న్యాయవాదులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయమూర్తి మహ్మద్ అబ్దుల్

కాంగ్రెస్ వైపే మొగ్గు..?

సొంతగూటికి చేరేందుకు మాజీ మంత్రి జూపల్లి, ఎమ్మెల్సీ కూచుకుళ్ల సన్నాహాలు

- ఇప్పటికే పలువురు కాంగ్రెస్ నేతలతో చర్చలు
- రసవత్తరంగా మారిన కందనూలు రాజకీయం

సాక్షి, నాగర్‌కర్నూల్: జిల్లాలోని సీనియర్ రాజకీయ నేతలు జూపల్లి కృష్ణారావు, కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సన్నాహాలు ప్రారంభించారు. ఈ దిశగా ఇరువురు నేతలు కీలక అడుగులు వేస్తున్నట్టు తెలుస్తోంది. శనివారం మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావుతో పాటు ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి హైదరాబాద్‌లో కాంగ్రెస్ నేతలతో భేటీ కావడంతో ఇరువురు కాంగ్రెస్ గూటికే చేరనున్నారనే సంకేతాలు వెలువడుతున్నాయి. దీంతో జిల్లాలో మారనున్న రాజకీయ సమీకరణాలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

■ గత ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి కొల్లాపూర్ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేసిన జూపల్లి కృష్ణారావు అప్పటి కాంగ్రెస్ అభ్యర్థి బీరం హర్షవర్ధన్‌రెడ్డి చేతిలో ఓటమిపాలయ్యారు. అనంతరం బీరం బీఆర్ఎస్‌లో చేరడంతో ఇరువురి మధ్యలో అంతర్గత పోరు నెలకొంది. స్థానిక ఎమ్మెల్యేతో పాటు సీఎం కేసీఆర్‌పై జూపల్లి నేరుగా విమర్శనాస్త్రాలు సంధించిన నేపథ్యంలో పార్టీ ఆయనపై సస్పెన్షన్ వేటు విధించింది. అప్పటినుంచి తాను ఏ పార్టీలో చేరుతారన్న దానిపై ఉత్కంఠ కొనసాగుతోంది. కాంగ్రెస్‌తో పాటు బీజేపీ నుంచి ఆహ్వానం అందినప్పటికీ కర్ణాటక ఎన్నికల్లో గెలుపుతో కాంగ్రెస్ పార్టీపై పెరిగిన అంచనాలు, స్థానిక పరిస్థితులు, అనుచరులు, ముఖ్య నాయకులు, కార్యకర్తల అభీష్టం మేరకు ఆయన కాంగ్రెస్‌లో చేరేందుకే మొగ్గు చూపుతున్నారు. అలాగే కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్సీగా ఎన్నికై బీఆర్ఎస్‌లో చేరి రెండోసారి ఎమ్మెల్సీగా కొనసాగుతున్న కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి తిరిగి సొంతగూటికి చేరేందుకే ఆసక్తి కనబరుస్తున్నారు. శనివారం టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లురవితో జూపల్లి, కూచుకుళ్ల వేర్వేరుగా భేటీ అయ్యారు. తాము పార్టీలో చేరితే దక్కే అవకాశాలు, హామీలు, ఇతర నేతల సహకారంపై చర్చించినట్టు తెలిసింది. ఈనెల 12న లేదా మరో నాలుగైదు రోజుల్లో ఇరువురు కాంగ్రెస్‌లో చేరుతారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.



జూపల్లి కృష్ణారావు



కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి

వడివడిగా నేతల మంతనాలు..

కాంగ్రెస్ పార్టీలో చేరే విషయమై ఇరువురు నేతలు వడివడిగా మంతనాలు జరుపుతున్నారు. పలువురు నేతలతో ప్రత్యేకంగా భేటీ కావడం ఆసక్తి రేపుతోంది. ఇప్పటికే ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరనున్నారనే ప్రచారం నేపథ్యంలో ఇటీవల ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి స్వయంగా కూచుకుళ్ల ఇంటికి వెళ్లినట్టు తెలిసింది. సీఎం సభకు ముందు ఆయన్ను ఆహ్వానించేందుకు వెళ్లగా, గంటకు పైగా ఎమ్మెల్సీతో ప్రత్యేకంగా భేటీ అయినట్టు సమాచారం. ఈసారి ఎన్నికల్లో తనకు మద్దతుగా నిలవాలని ఎమ్మెల్యే కోరగా దామోదర్‌రెడ్డి మాత్రం తానూ ఎన్నికల బరిలో ఉంటానని తేల్చిచెప్పినట్టు తెలిసింది. కాగా.. ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరుతున్నారన్న వార్తలపై మాజీమంత్రి నాగం జనార్దన్‌రెడ్డి స్పందిస్తూ.. ఎమ్మెల్సీ పార్టీలో చేరడాన్ని స్వాగతిస్తున్నానని, అయితే పార్టీ టికెట్ ఎవరికి ఇచ్చినా సహకారం అందించాలని స్పష్టం చేశారు. మరోవైపు టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లురవితో పాటు కొల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ నేత జగదీశ్వర్‌రావుతో జూపల్లి ప్రత్యేకంగా భేటీ అయ్యారు. తాను పార్టీలో చేరుతున్నానని, సహకారం అందించాలని కోరినట్టు తెలిసింది. పార్టీ ఎవరికి టికెట్టు ఇచ్చినా మద్దతుగా నిలవాలని జగదీశ్వర్‌రావు చెప్పినట్టు సమాచారం. అయితే తానే వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున బరిలో ఉంటున్నట్టు జగదీశ్వర్‌రావు చెబుతుండడం గమనార్హం.

క్లుప్తంగా

బాలికను మోసం చేసిన వ్యక్తికి మూడేళ్ల జైలుశిక్ష

మిడ్జిల్: ప్రేమ పేరుతో బాలికను లోబర్చుకుని గర్భవతిని చేసి.. తప్పించుకొని తిరుగుతున్న వ్యక్తికి మహబూబ్‌నగర్ జువైనల్ కోర్టు మూడేళ్ల కఠిన కారాగార శిక్ష విధించిందని ఎస్ఐ రాంలాల్‌నాయక్ శనివారం తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికను రాజాపూర్‌కు చెందిన బైండ్ల నాగరాజు ప్రేమిస్తున్నానని నమ్మించి గర్భవతి అయిన తర్వాత తప్పించుకొని తిరుగుతున్నాడు. ఈ ఘటనపై బాలిక తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి సాక్ష్యాధారాలను జువైనల్ కోర్టులో ప్రవేశపెట్టడంతో నేరం రుజువైంది. దీంతో నిందితుడికి పోక్సో చట్టం కింద మూడేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ తీర్పిచ్చారని ఎస్ఐ తెలిపారు. కేసులో సాక్ష్యాధారాలను సకాలంలో ప్రవేశపెట్టిన సీఐ జములప్ప, కోర్టు కానిస్టేబుల్ నానునాయక్‌ను జడ్జి అభినందించారన్నారు.

ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య

మరికల్: ఓ వ్యక్తి కడుపునొప్పి భరించలేక ఇంట్లో ఉరి వేసుకొని మృతి చెందిన ఘటన మరికల్‌లో చోటుచేసుకుంది. నర్వ మండలం పాతర్‌చేడ్‌కు చెందిన కుర్వ నరేష్(32) గొర్రెల కాపరిగా పనిచేస్తున్నాడు. ఆయనకు రేణుకతో 13 ఏళ్ల క్రితం వివాహం కాగా.. వారికి ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. అయితే ఐదు రోజుల క్రితమే మరికల్‌లో అద్దె ఇల్లు తీసుకొని ఉంటున్నారు. శనివారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడని, అది భరించలేకే ఆత్మహత్యకు పాల్పడ్డాడని కుటుంబసభ్యులు పోలీసులకు తెలిపారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నాట్లు ఎస్ఐ హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా: యువకుడి మృతి

అడ్డాకుల: మండలంలోని పొన్నకల్ గ్రామానికి చెందిన ఓ యువకుడు ట్రాక్టర్ బోల్తాపడిన ఘటనలో మృతిచెందాడు. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి సత్యన్న, రాములమ్మ దంపతుల కుమారుడు లక్ష్మణ్(18) అదే గ్రామానికి చెందిన ట్రాక్టర్‌పై వెళ్లాడు. ట్రాక్టర్‌ను డ్రైవర్ నడుపుతుండగా పక్కనే కూర్చున్నాడు. మట్టిని తరలించే క్రమంలో అకస్మాత్తుగా ట్రాక్టర్ బోల్తాపడింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన లక్ష్మణ్‌ను కుటుంబ సభ్యులు జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ట్రాక్టర్‌పై ఉన్న డ్రైవర్ ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. ఈ ఘటనతో తల్లిదండ్రులు శోకసంద్రంలో మునిగిపోయారు. దీనిపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

చెరువులో పడి బాలుడు..

అడ్డాకుల: మూసాపేట మండలం తాళ్లగడ్డ గ్రామానికి చెందిన బాలుడు చెరువులో పడి ప్రాణాలు కోల్పోయాడు. గ్రామస్తుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన ఈశ్వరయ్యగౌడ్, రాధ దంపతులకు ముగ్గురు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. కుమారుడు వినయ్‌కుమార్‌గౌడ్(11) ఐదో తరగతి చదువుతున్నాడు. శనివారం గేదెలను మేపడానికి పొలం వద్దకు వెళ్లాడు. గ్రామానికి సమీపంలో ఉన్న పెట్టెరాళ్ల కుంట వద్ద దుస్తులు, చెప్పులను వదిలిలోపలికి నీటిలోకి వెళ్లాడు. సాయంత్రం తర్వాత కుంట వద్ద దుస్తులు, చెప్పులు కనిపించడాన్ని గుర్తించిన ఓ రైతు గ్రామస్తులకు సమాచారం ఇచ్చాడు. కుంట నీటిలో వెతకగా.. బాలుడి మృతదేహం కనిపించింది. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు శోకసంద్రంలో మునిగి పోయారు. ఈ సంఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

వృద్ధురాలి మృతదేహం లభ్యం

అడ్డాకుల: మండలంలోని శాఖాపూర్ టోల్‌ప్లాజా సమీపంలోని బావిలో మహిళ మృతదేహం లభ్యమైనట్లు ఎస్ఐ మాధవరెడ్డి తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం.. జడ్చర్లకు చెందిన ఫాతిమాబేగం(72) ఈ నెల 7న ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లిపోయింది. జాతీయ రహదారిపై నడుచుకుంటూ అడ్డాకుల వైపు వచ్చింది. రహదారి పక్కన ఉన్న వ్యవసాయ బావిలో పడిపోయింది. శనివారం బావిలో మృతదేహం కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి వెళ్లిన పోలీసులు విచారణ చేపట్టారు. మృతి చెందిన మహిళ జడ్చర్లకు చెందిన ఫాతిమాబేగంగా గుర్తించారు. ఆమె మృతదేహాన్ని శవపరీక్షల నిమిత్తం జనరల్ ఆస్పత్రికి తరలించారు. ఫాతిమాబేగం కుమారుడు లతీఫ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వరిపంట దగ్ధం

తెలకపల్లి: అగ్ని ప్రమాదానికి వరిపంట దగ్ధమైన సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. లక్నారం చెందిన దూళ్ల చిన్న ఉస్సేన్ తన పొలంలో వరిపంటను సాగు చేశారు. పంట కోతకు రాగా.. శుక్రవారం అర్ధ రాత్రి నిప్పంటుకుని పూర్తిగా కాలిపోయింది. పక్కనే ఉన్న స్ప్రింక్లర్ పైపులు అగ్నికి కాలిపోయినట్లు బాధితులు తెలిపారు. దాదాపు రూ.1.50లక్షల నష్టం జరిగినట్లు పేర్కొన్నారు. కావాలనే గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించి ఉంటారని బాధితులు అనుమానిస్తున్నారు.

మతసామరస్యానికి ప్రతీక ఉర్సు

నేటినుంచి షా అలీ పహిల్వాన్ ఉర్సు ప్రారంభం

- 11న గంధోత్సవం
- సర్ ముబారక్, ధడ్ ముబారక్ చిన్న, పెద్ద కిస్తీలకు ప్రత్యేక ఏర్పాట్లు
- భారీగా తరలిరానున్న భక్తులు
- ఏర్పాట్లపై అన్ని శాఖల అధికారులతో ఎమ్మెల్యే, ఆర్డీఓ సమీక్ష



షా అలీ పహిల్వాన్ దర్గా ముఖ ద్వారం

అలంపూర్: మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే అలంపూర్ షా అలీ పహిల్వాన్ 772 ఉర్సు నేటి నుంచి ప్రారంభం కానుంది. కులమతాలకు అతీతంగా అలంపూర్ పట్టణంలోని షా అలీ పహిల్వాన్ సర్ ముబారక్, ధడ్ ముబారక్ దర్గాల్లో జరిగే ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ నెల 11వ తేదీ నుంచి 14వ తేదీ వరకు ఉర్సు జరగనున్నట్లు దర్గా అభివృద్ధి కమిటీ నిర్వాహకులు తెలిపారు. దర్గా చైర్మన్ సయ్యద్ షా అహ్మద్ ఉవైసీ ఖాద్రి అధ్వర్యంలో ఈ ఉర్సు జరగనుంది. అధికారికంగా జరిగే ఉర్సుకు భక్తులు భారీగా తరలిరానుండటంతో సౌకర్యాలు కల్పనపై ఇప్పటికే ఎమ్మెల్యే డాక్టర్ వీఎం అబ్రహం, ఆర్డీఓ రాములు అన్ని శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

11నుంచి 14వరకు ఉత్సవాలు..

ఈ నెల 11వ తేది నుంచి 14వ తేది వరకు ఉర్సు కొనసాగనుంది. 11వ తేదీ రాత్రి గంధోత్సవం ఉంటుంది. రాత్రి సయ్యద్ ఖాదర్ వలి సాహెబ్ ఇంటి నుంచి తహసీల్దార్ కార్యాలయానికి గంధం తీసుకెళ్తారు. అక్కడ ప్రత్యేక ప్రార్థనల అనంతరం సర్ ముబారక్ దర్గాకు భాజాభంజత్రీలు, డప్పు వాయిద్యాల మధ్య ఊరేగింపుగా గంధాన్ని తీసుకెళ్తారు. సర్ ముభారక్ దర్గాలో గంధం సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. చివరగా ధడ్ ముబారక్ దర్గాలకు గంధాన్ని తీసుకెళ్లి ప్రార్థనలు చేయడం ఆనవాయితీ. 12వ తేది సర్ ముబారక్ దర్గాలో చిన్న కిస్తిలు జరగనున్నాయి. 13వ తేదీ ధడ్ ముబారక్ దర్గా వద్ద పెద్ద కిస్తీలు నిర్వహిస్తారు. పెద్ద కిస్తీ పోటీలను వీక్షించడానికి వేలాదిగా జనం తరలి వస్తారు. 14వ తేది మహిళల ప్రత్యేక ఉర్సుతో ఉత్సవాలు ముగియనున్నాయి.



ధడ్ ముబారక్ దర్గా

తరలిరానున్న భక్తులు

ఉర్సుకు అలంపూర్ చుట్టుపక్కల గ్రామాల ప్రజలతోపాటుగా ఉమ్మడి జిల్లా నుంచేకాకుండా నాగర్‌కర్నూలు, వనపర్తి, మహబూబ్‌నగర్, హైదరాబాదు, కర్నూలు, కర్ణాటకలోని రాయచూరు నుంచి భక్తులు వస్తారు. భక్తుల రాకను దృష్టిలో ఉంచుకొని దర్గాల్లో ఏర్పాట్లు చేశారు.

గుల్బర్గా దర్గా నుంచి గంధం

ఉర్సుకు గుల్బర్గా దర్గా నుంచి గంధం తీసుకరావడం ఆనవాయితీ. తరతరాల సాంప్రదాయానికి స్వాగతం పలుకుతూ ఉర్సు నిర్వహిస్తారు. కర్ణాటక రాష్ట్రంలోని గుల్బర్గా ఖాజా బందేనవాజ్ దర్గాలో ఉర్సు ముగిసిన అనంతరం అక్కడి నుంచి గంధాన్ని అలంపూర్‌కు తీసుకువస్తారు. గుల్బర్గా దర్గా నుంచి వచ్చే గంధం మొదట సయ్యద్ ఖాదర్ బాష ఇంటికి చేరుతుంది. అక్కడి నుంచి షా అలీ పహిల్వాన్ ఉర్సు ప్రారంభిస్తారు.



సర్ ముబారక్ దర్గా



దర్గా సమీపంలో సిద్ధమవుతున్న రంగుల రాట్నాలు

లోక్‌అదాలత్ ద్వారా మొండి బకాయిల పరిష్కారం



లోక్‌అదాలత్ కార్యక్రమంలో పాల్గొన్న బ్యాంక్ అధికారులు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లాకేంద్రంలోని జిల్లా న్యాయసేవ అధికార సంస్థ ద్వారా యూనియన్ బ్యాంక్‌కు సంబంధించిన 655 మంది మొండి బకాయిలకు లోక్ అదాలత్ ద్వారా నోటీసులు పంపించగా శనివారం జరిగిన లోక్ అదాలత్ కార్యక్రమంలో భాగంగా 93 కేసులు, రూ.13.05 లక్షల వరకు నగదు రికవరీని పరస్పర అంగీకారంతో సెటిల్‌మెంట్ ద్వారా పరిష్కరించుకోవడం జరిగిందని బ్యాంక్ అధికారులు తెలిపారు. లోక్ అదాలత్ ద్వారా పరిష్కారం చేసుకున్న మొండి బకాయిదారులు జిల్లా న్యాయసేవ అధికార సంస్థకు, బ్యాంక్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ డిప్యూటీ రీజినల్ అధికారి క్రిష్ణమూర్తి, చీఫ్ మేనేజర్లు హరిప్రసాద్, ఉత్తమ్, అమిత్‌సాహు, రీజినల్ కార్యాలయ అధికారి తిలక్ పాల్గొన్నారు.

పార్టీ గెలుపే లక్ష్యంగా ముందుకుసాగాలి

- మెదక్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు ఎస్.మల్లారెడ్డి

పాలమూరు: రాష్ట్రంలో రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు ముందుకు సాగాలని మెదక్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు ఎస్.మల్లారెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలోని బీజేపీ సీనియర్ నాయకులతో శనివారం జరిగిన సమావేశంలో మల్లారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పార్టీ బలోపేతానికి బీజేపీ సీనియర్ నాయకులు ముఖ్య భూమిక పోషించాలని కోరారు. మీ ఆశయాలు నెరవేరే సమయం దగ్గరలోనే ఉందని, దాని కోసం కొత్తతరం నాయకత్వంలో పనిచేస్తున్న బీజేపీ నాయకులు, కార్యకర్తలకు క్షేత్రస్థాయిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సీనియర్ నాయకులు పార్టీకి సమయం ఇచ్చి పనిచేయాలన్నారు.



మాట్లాడుతున్న మెదక్ జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లారెడ్డి

సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పద్మజా రెడ్డి, జిల్లా అధ్యక్షులు వీరబ్రహ్మాచారి, మాజీ మంత్రి పి.చంద్రశేఖర్, న్యాయవాది ఎన్పీ.వెంకటేశ్, దళితమోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొండయ్య, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

బైకు, కారు ఢీ: వివాహిత దుర్మరణం

ఉండవెల్లి: హైదరాబాద్ నుంచి కర్నూలు వైపు వెళ్తున్న బైక్‌ను వెనక నుంచి కారు ఢీకొనడంతో బైక్‌పై ఉన్న భార్యాభర్తల్లో భార్య మృతిచెందింది. ఈ ఘటనకు సంబంధించి స్థానికుల కథనం ప్రకారం.. ఏపీలోని కర్నూలు జిల్లా పాల్‌కల్ గ్రామానికి చెందిన నతనేయులు, కారుణ్య సుజాత(28) శనివారం సాయంత్రం బంధువుల పెళ్లి కోసం హైదరాబాద్ నుంచి ద్విచక్రవాహనంపై కర్నూలు వైపు వెళ్తున్నారు. అలంపూర్ చౌరస్తా సమీప మార్గంలో వెంకటసాయినగర్‌కు ఎదురుగా జాతీయ రహదారిపై వెళ్తున్న బైక్‌ను ఒక్కసారిగా అతివేగంగా వెళ్తున్న కారు వెనక నుంచి ఢీకొనడంతో బైక్‌పైన ఉన్న నతనేయులుకు కాలు విరగగా.. ఆయన భార్య కారుణ్య సుజాత(28) అక్కడికక్కడే మృతిచెందింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సుజాత మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం అలంపూర్ ఆస్పత్రికి, నతనేయులును చికిత్స నిమిత్తం కర్నూలు ఆస్పత్రికి తరలించారు. కారు రోడ్డు పక్కకు పడటంతో కేరళకు చెందిన డ్రైవర్ అఖిల్ జైతిలకాన్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

కేసు నమోదు

అచ్చంపేట రూరల్: మండలంలోని జోగ్యతండాకు చెందిన వివాహిత అదృశ్యమైంది. సిద్దాపూర్ ఎస్ఐ గురుస్వామి కథనం ప్రకారం.. తండాకు చెందిన సక్రు 3న వ్యవసాయ పొలంలో పనులు చేయడానికి వెళ్లగా భార్య జ్యోతి ఇంటి వద్దనే ఉంది. సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా భార్య కనిపించలేదు. శనివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

పాన్‌గల్: పంట పొలాల్లో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. గ్రామస్తులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. మండలంలోని కదిరెపాడుకు చెందిన బోయ రాములు(50) గొర్రెల కాపరిగా జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం జీవాలను గ్రామ సమీపంలోని పంట పొలాలకు మేతకు తీసుకెళ్లిన వ్యక్తి సాయంత్రం జీవాలు ఇంటికి వచ్చిన ఆయన రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు చుట్టు పక్కల ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. శనివారం ఉదయం పంట పొలాల సమీప రైతులు శవం ఉందని సమాచారం ఇవ్వడంతో కుటుంబ సభ్యులు వెళ్లి చూసి రాములుగా గుర్తించారు. ఈ విషయాన్ని పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. అయితే గొర్రెలను మేపేందుకు వెళ్లిన వ్యక్తి వెంకట్‌రెడ్డి మామిడి తోటలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందడంపై కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేశారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించే క్రమంలో పోలీసులతో కుటుంబ సభ్యులకు వాగ్వాదం చేటుచేసుకుంది. పోస్టుమార్టం నిర్వహిస్తేనే సహజ మరణమా.. హత్యనా అనే విషయాలు బయటపడతాయని, పోస్టుమార్టం రిపోర్టు ఆధారంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ ఘటనపై రాములు భార్య ఇందిర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ రామచందర్ తెలిపారు. రాములుకు భార్యతో పాటు ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు.



సంఘటన స్థలంలో వివరాలు సేకరిస్తున్న పోలీసులు

WANTED
Raymond Cloth Show Room
జడ్చర్ల, నాగర్‌కర్నూల్, వనపర్తిలో పని చేయుటకు అనుభవం కలవారు కావలెను.
- Sales Incharge
- Sales Executives
- Store Incharge
- Office Boys

సెల్: 9492801999, 9492104040

20 ఏళ్లకు ఇంటికి చేరిన వృద్ధురాలు

మక్తల్: మతిస్థిమితం సరిగా లేక తప్పిపోయిన ఓ వృద్ధురాలు ఎంపీడీఓ చొరవతో 20 ఏళ్ల తర్వాత ఇంటికి చేరుకుంది. వివరాలిలా.. మండలంలోని గుడిగండ్లకు చెందిన బండెలి కొండమ్మ 65 ఏళ్ల వయస్సులో మతిస్థిమిత్తం లేక ఎక్కడికో వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు చుట్టుపక్కల గ్రామాల్లోని బంధువుల ఇళ్ల దగ్గర వెతికినా ఫలితం లేకపోవడంతో మృతిచెంది ఉంటుందని భావించారు. అయితే మహబూబ్‌నగర్‌లోని పద్మావతికాలనీలో నివాసం ఉంటున్న మక్తల్ ఎంపీడీఓ శ్రీధర్ శనివారం ఇంటి నుంచి బయటకు వస్తున్న సమయంలో అక్కడ అచేతనంగా పడి ఉన్న కొండమ్మను చూసి వివరాలు తెలుసుకున్నారు. తమది గుడిగండ్ల గ్రామం అని చెప్పడంతో కారులో గుడిగండ్లకు తీసుకువచ్చి గ్రామస్తులకు చూపించారు. ఆమెను గుర్తుపట్టిన వారు వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో ఇంటికి తీసుకెళ్లారు. తమ తల్లిని అప్పగించిన ఎంపీడీఓకు వారు కృతజ్ఞతలు తెలిపారు.



కుటుంబ సభ్యులతో కొండమ్మ

సీఎం పర్యటనకు పటిష్ట భద్రత

- 2వేల మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాట్లు
- దిశా నిర్దేశం చేసిన డీఐజీ ఎల్ఎస్ చౌహాన్



భద్రతా అంశాలపై ఎస్పీ సృజనతో మాట్లాడుతున్న డీఐజీ చౌహాన్

గద్వాల క్రైం: సీఎం కేసీఆర్ ఈ నెల 12న జోగుళాంబ గద్వాల జిల్లాకు రానున్న నేపథ్యంలో డీఐజీ ఎల్ఎస్ చౌహాన్ నేతృత్వంలో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. శనివారం సాయంత్రం ఆయన గద్వాలకు చేరుకొని పలు అంశాలపై ఎస్పీ సృజనతో మాట్లాడారు. సీఎం పర్యటన రూట్ మ్యాప్, పోలీసు సిబ్బంది, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దిశానిర్దేశం చేశారు. సీఎం పర్యటనలో దాదాపు రెండు వేల మంది పోలీసు సిబ్బంది భద్రతా విధులు చేపట్టనున్నారు. ఇప్పటికే నిఘా బృందం, బాంబు స్క్వాడ్, ప్రత్యేక పోలీసు సిబ్బంది సమస్యాత్మక ప్రాంతాలు, అంశాలపై ఆరా తీశారు. బీఆర్ఎస్ పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవం నుంచి జిల్లా సమీకృత కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయం, బహిరంగ సభ ప్రాంగణం వద్ద ముమ్మర తనిఖీలు చేపట్టనున్నారు. బస్టాండ్, రైల్వే స్టేషన్, ముఖ్య కూడళ్లలో మఫ్టీ పోలీసుల నిఘా పెంచారు. ఏర్పాట్ల నేపథ్యంలో ఆదివారం నుంచే జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ అంతరాయం కలగకుండా పలు రూట్లలో వాహనాలను దారి మళ్లించనున్నారు.

హై అలర్టు...

సీఎం పర్యటనలో భాగంగా నలుగురు ఎస్పీలు, నలుగురు ఏఎస్పీలు, 16మంది డీఎస్పీలు, 46మంది సీఐలు, 130మంది ఎస్ఐలు మొత్తం 2 వేల మంది పోలీసులు సీఎం పర్యటనలో విధులు నిర్వహించేలా ఎస్పీ సృజన చర్యలు తీసుకున్నారు. ఎలాంటి అవాంతరాలు కలగకుండా, నిరసనలకు దిగే అవకాశం ఉన్న పలు పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, ప్రజా, విద్యార్థి సంఘాల నాయకులను ముందస్తు అరెస్టు చేసేందుకు వెనకాడవద్దని ఆదేశించినట్లు సమాచారం. సీఎం పర్యటించే మార్గం, సభా స్థలి ఇతరత్రా ప్రదేశాలను సీసీ కెమెరాలతో పర్యవేక్షించనున్నారు.

గద్వాల జిల్లాకు మెడికల్ కళాశాల మంజూరు చేయాలి



బహిరంగ లేఖను విడుదల చేస్తున్న వివిధ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు

గద్వాల అర్బన్: సీఎం కేసీఆర్ గద్వాలకు మెడికల్ కళాశాలకు అసెంబ్లీ సాక్షిగా హామీ ఇచ్చారని, కానీ ఇప్పటి వరకు కళాశాల మంజూరుకు జీఓ విడుదల చేయలేదని, సీఎం కేసీఆర్ ఈనెల 12న గద్వాలకు వస్తున్న నేపథ్యంలో మెడికల్ కళాశాల మంజూరు చేసి, ఈ విద్యాసంవత్సరం నుంచే తరగతులను ప్రారంభించే విధంగా ప్రకటన చేయాలని వివిధ పార్టీలు, సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం జిల్లా కేంద్రంలోని క్రిష్ణవేణి చౌరస్తాలో బహిరంగ లేఖను విడుదల చేశారు. వివిధ పార్టీలు, ఆయా సంఘాల నాయకులు నాగర్‌దొడ్డి వెంకట్రాములు, మధుసూదన్ బాబు, వెంకటస్వామి, ఆంజనేయులు, అతిఖుర్ రహ్మాన్ మాట్లాడుతూ.. పాలకుల నిర్లక్ష్యం వల్లే జిల్లా విద్యలో వెనుకబడిందని, ప్రభుత్వం ఇప్పటికే నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాలకు మెడికల్ కళాశాలలు మంజూరు చేసి ప్రారంభించిందని, జిల్లాకు మెడికల్ కళాశాలను మంజూరు చేసి, ఈ ఏడాది నుంచే తరగతులను ప్రారంభించాలని కోరారు. కార్యక్రమంలో శివరాజ్, అలూరు ప్రకాష్ గౌడ్, వాల్మీకి, వినోద్ కుమార్, గోపాల్ రావు, దామోదార్, రహిమతుల్లా, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ 50% Concession to SC, BC, Minority & Poor. 100% పాస్ గ్యారెంటీ, అక్టోబర్ ఎగ్జామ్స్ లాస్ట్ డేట్: 14/06/2023, డిస్కంటిన్యూడ్? పదే పదే ఫెయిల్ అవుతున్నారా??" Direct SSC, Inter One Sitting, Any Degree, PG, D.Pharma, పాలిటెక్నిక్, All మెడికల్ కోర్సులు, Hyd. Cell: 6309624934.

SERVICES

BUSINESS OFFER

■ ద్వారకా ఎంటర్‌ప్రైజెస్: పేపర్ ప్లేట్స్ & LED మెషిన్స్‌పై ప్రతి నెల అధిక ఆదాయం, అద్భుత అవకాశం ఉచిత ముడి పదార్థాలు, 100% తిరిగి కొనుగోలు ఒప్పందం. ఫోన్:9310515824, 8800496710.

HEALTH CARE

ORTHOPEDIC SURGEON

■ డా॥యస్.రవితేజ రెడ్డి, M.S., (ORTHO) (KMC మణిపాల్) ఎముకలు, నరములు, వెన్నెముక & కీళ్ళ మార్పిడి శస్త్ర చికిత్స నిపుణులు. శిరీష పాలీ క్లినిక్, అపోలో హాస్పిటల్ ప్రక్కన, 3వ లైన్, N.R.పేట, కర్నూలు. 08518 - 228888, 83412 98888

GYNECOLOGY

■ కార్తీక్ హాస్పిటల్, నుంబేసుల రోడ్, కర్నూలు. సంతాన సమస్యలు, అన్ని రకాల స్త్రీ వ్యాధులు, జనరల్, బి.పి. షుగర్ వ్యాధులకు ఉత్తమ చికిత్స. డా॥ యస్.చంద్రశేఖర్, M.D. ఫిజిషియన్, డా॥ పార్వతీదేవి, M.D., DGO., స్త్రీ వ్యాధి, ల్యాపరోస్కోపి నిపుణులు. టైమింగ్స్: 10-8PM, 08518-226162

WANTED

■ 10th, ఇంటర్, డిగ్రీ (P/F) అయ్యి ఖాళీగా వున్న 39 స్త్రీ/పులకు మా కంపెనీలో పనిచేయుటకు కావలెను. జీ: 14 వేలు+ 6 వేలు DA + ఫ్రీ రూం, భోజనం. నో ఫీజు. మహబూబ్‌నగర్. 80742 77136

■ చెన్నై, అసురన్ సోప్స్, డిటర్జెంట్ పౌడర్ అన్ని రకాల లిక్విడ్లను ఏ.పి.& తెలంగాణ వ్యాప్తంగా విక్రయించడానికి ఏరియాల వారిగా డిస్ట్రిబ్యూటర్స్ కావలెను. 73965 77077.

■ మణికంఠ ట్రాక్టర్ షోరూమ్ నందు పని చేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, సిస్టమ్ ఆపరేటర్స్ మరియు మెకానిక్ జాబ్స్ వేకెన్సీలు కలవు. ఆసక్తి కల వారు షోరూమ్ నందు సంప్రదించగలరు. అడ్రస్: ఏనుగొండ, మహబూబ్‌నగర్.

■ పనివారు కావలెను. హైదరాబాద్, లింగంపల్లిలో ఉండి ఇంటిపని, వంటపని, వృద్ధుల సేవ, పిల్లల పోషణకు స్త్రీలు, కావలెను. సంప్ర॥ 9391912949, 040-40123376.

■ మహబూబ్‌నగర్ జిల్లా, గద్వాలలో ప్రముఖ సినిమా థియేటర్స్, షాపింగ్ మాల్స్ నందు పనిచేయుటకు ఆసక్తి గల సెక్యూరిటీ గార్డ్స్ (M/F) సెక్యూరిటీ సూపర్‌వైజర్స్, హౌస్ కీపింగ్ (M/F) కావలెను. సంప్ర: 93812 84920, 98775 34196, 63090 10779

■ లేపాక్షి హెల్త్ కేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం, జీ.18k. పేషెంట్ కమీషన్ 6k. ఫోన్: 9840400073

■ షిర్డీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో పనిచేయుటకు లేడీ వార్డెన్స్, ఆయాలు, బార్యాభర్తలు, డ్రైవర్స్,సాయి మందిరములో పూజారి కావలెను. ఫోన్: 9391098931, 9248585901.

FACULTY TEACHERS

■ WANTED to teach Nursery to 10th (E/M) Primary : EVS, ENG, MATHS High:MATHS, Bio, Social, Hindi, Physics Sal:6000 to 20,000 Cell:6300047459, 9885750467

■ English Teachers' Training to Get Trained, Certified & Get Highly Paid Jobs in Top 500 Edu. Inst. Contact : 9248481331

సాక్షి ద్వారా మీ ఆప్తులకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేయండి కేవలం రూ. 500/- మాత్రమే
HAPPY BIRTHDAY

సాక్షి భవిత విద్యార్థుల కోసం

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని క్షుణ్ణంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరుతున్నాం. ప్రకటనదారు తెలిపే రీతిలో క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధంలేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు - సాక్షి మేనేజర్

క్లుప్తంగా...

భారతీయ మూలాలు నేటి తరానికి ఎంతో అవసరం

సనాతన సంప్రదాయాలతో యువతరాన్ని తీర్చిదిద్దాలి: తమిళిసై



మద్దిలపాలెం(విశాఖ తూర్పు): మన భారతీయ మూలాలు, సనాతన సంప్రదాయాలను నేటి యువతరానికి అందించాల్సిన అవసరం పెద్దలపై ఉందని, ఆ దిశగా కృషి చేయాలని తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ పిలుపునిచ్చారు. భారతీయత– అమృతకాలంపై రెండు రోజుల జాతీయ సదస్సు శనివారం విశాఖ ఏయూ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలోని డాక్టర్. వై.వి.ఎస్.మూర్తి ఆడిటోరియంలో ప్రారంభమైంది. సద్గురు శివానందామూర్తి ఆశీస్సులతో సుపథ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ సదస్సులో ముఖ్య అతిథిగా ఆమె మాట్లాడారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయం ప్రపంచ దేశాలకు ఎంతో ఆదర్శంగా నిలుస్తున్నాయనీ అలాంటి మన మూలాలు నేటి తరానికి దూరం కాకుండా వారికి చేరువ చేయాలన్నారు. మన జీవన విధానంలో చోటుచేసుకుంటున్న మార్పులతో పెను ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందనీ, ఇలాంటి తరుణంలో మన పూర్వీకులు పాటించిన ఆధ్యాత్మికత, ఆహారపు అలవాట్లను, సంప్రదాయాలను యువతరానికి అందించాలని సూచించారు. ఉదయం జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన విశ్రాంత వైస్ అడ్మిరల్ రామన్ పూరి మాట్లాడుతూ మన భారతీయతను భావితరాలకు చాటి చెప్పాలని పిలుపునిచ్చారు. ఏపీ రాష్ట్ర ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి ఎల్వీ సుబ్రహ్మణ్యం చేతుల మీదుగా ప్రొఫెసర్ కె. సరస్వతి విద్యార్థిని రచించిన 'పద్మభూషణ్ డాక్టర్ శ్రీపాద పినకపాణి సంగీత నిధి'పుస్తకాన్ని ఆవిష్కరించారు.

23 మందితో తెలుగు మహిళ కమిటీ

సాక్షి, హైదరాబాద్: టీటీడీపీ అనుబంధ విభాగమైన తెలుగు మహిళ రాష్ట్ర కమిటీలో 23 మందికి చోటు కల్పించారు. వీరికి శనివారం తెలంగాణ తెలుగుదేశం అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ నియామక ఉత్తర్వులను జారీ చేశారు. రాష్ట్ర మహిళా అధ్యక్షురాలిగా భవనం షకీలా రెడ్డి ఇప్పటికే నియమితులయ్యారు. ప్రధాన కార్యదర్శిగా ధనకాడ్ రాధిక (నల్గొండ పార్లమెంటు), అధికార ప్రతినిధిగా లక్ష్మి (నల్లగొండ పార్లమెంటు)తో పాటు ఆరుగురు కార్యనిర్వాహక కార్యదర్శులు, 15 మంది కార్యదర్శులు కొత్తగా నియమితులయ్యారు.

ఉద్దానానికి ఊపిరి

కిడ్నీ వ్యాధికి శాశ్వతంగా చరమగీతం పాడేలా ఏపీ ప్రభుత్వం చర్యలు

రూ.700 కోట్లతో చేపట్టిన మంచి నీటి పథకం ట్రయల్ రన్‌కు సిద్ధం

- ఖర్చుకు వెనకాడకుండా ఏడాది పొడవునా నీటి సరఫరాకు ప్రాధాన్యత
- 100 కి.మీ దూరంలోని హీరమండలం నుంచి నీటి తరలింపు
- నదుల కింద, కొండలను తొలిచి భూగర్భ పైపులైన్ నిర్మాణం
- మొత్తంగా 1047 కి.మీ పొడవునా భూగర్భ పైపులైన్

గ్రౌండ్ రిపోర్ట్



మెలియాపుట్టి వద్ద నీటిని శుద్ధి చేసేందుకు ఏర్పాటు చేసిన ఫిల్టర్ బెడ్‌లు

ఉద్దానం ప్రాంతం నుంచి మేడికొండ కోటిరెడ్డి, వడ్డే బాలశేఖర్: శ్రీకాకుళం జిల్లా ఉద్దానం ప్రాంతంలో ప్రజలు కిడ్నీ వ్యాధి బారిన పడి అల్లాడుతుంటే గత ప్రభుత్వాలు మాటలతో మభ్యపెడితే.. వైఎస్ జగన్ ప్రభుత్వం చిత్తశుద్ధితో వేసిన అడుగులు ఫలితాలివ్వడానికి సిద్ధమయ్యాయి. నాలుగు దశాబ్దాల తరబడి అపరిష్కృతంగా ఉన్న నీటి సమస్య పరిష్కారించడానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టిన వెంటనే.. పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు రూ.700 కోట్లతో సమగ్ర రక్షిత మంచినీటి పథకం మంజూరు చేశారు. ఈ ప్రాజెక్టు ప్రస్తుతం ప్రారంభోత్సవ దశకు చేరింది. హీరమండలం నుంచి తాగునీటిని తరలించే ప్రక్రియలో ఉపయోగించే నీటి మోటార్లకు మూడు, నాలుగు రోజుల్లో ట్రయల్ రన్ మొదలవ్వనుంది.

దీర్ఘకాలిక ప్రయోజనాలే లక్ష్యం

ఉద్దానం ప్రాంతంలో అక్కడి భూగర్భ జలాలనే తాగునీటిగా ఉపయోగించడం వల్ల కిడ్నీ వ్యాధులు ప్రబలుతున్నాయనే వాదన ఉంది. ప్రజల్లో కూడా ఇదే విషయమై ఆందోళన ఉంది. అయితే ఇప్పుడు కూడా ఆ ప్రాంతంలో కొన్ని మంచినీటి పథకాలు ఉన్నా.. అవి ఎక్కువగా స్థానికంగా బోర్లు వేసి సరఫరా చేసేవే. మరోవైపు.. తక్కువ ఖర్చుతో ఉద్దానం ప్రాంత సమీపంలో ఉండే బహుదా, మహేంద్ర తనయ నదుల నుంచి రక్షిత నీటి సరఫరాకు అవకాశం ఉన్నా, వేసవిలో ఆ నదులు ఎండిపోతే ప్రజలు బోరు నీటిని తాగక తప్పదని జగన్ సర్కార్ ఆ ప్రతిపాదనను మొదట్లోనే పక్కన పెట్టింది. ఏడాది పొడవునా నీరు అందుబాటులో ఉండేలా ఖర్చు ఎక్కువైనా సరే వెనుకాడకుండా హీరమండలం రిజర్వాయర్ నుంచి నీటి తరలింపునకు పూనుకుంది. ఉద్దానం ప్రాంతం మొత్తానికి ఏడాది పొడవునా నీటి అవసరానికి ఒక టీఎంసీ కన్నా తక్కువ నీరే అవసరం ఉంటుంది. హీరమండలం రిజర్వాయర్ కనీస నీటి మట్టం 2.67 టీఎంసీలు ఉండటం వల్ల ఉద్దానం ప్రాంతానికి నీటి సరఫరాకు ఎలాంటి ఇబ్బంది ఉండదు.

జగన్ ప్రభుత్వ 'భగీరథ'యత్నం

హీరమండలం రిజర్వాయర్ నుంచి ఉద్దానం ప్రాంతానికి నీటి తరలింపు అషామాషీ కాకపోయినా ప్రభుత్వం పట్టుదలగా పనులు చేపట్టి పూర్తి చేసింది. ఈ ప్రక్రియలో ఏకంగా 1,047 కిలోమీటర్ల పొడవునా భూగర్భ పైపులైన్ల నిర్మాణం చేశారు. రోజూ 8.40 కోట్ల లీటర్ల మేర తాగునీరు ఆ భూగర్భ పైపు లైను ద్వారా వెళ్లేలా పనులు చేపట్టారు. కేవలం రిజర్వాయర్ వద్ద ఏర్పాటు చేసిన రెండు భారీ మోటార్లు ఒక్కొక్కటి నిమిషానికి 28 వేలకు పైగా లీటర్ల నీటిని పంపింగ్ చేయగలవు. ఈ నీరు ఎగుడు దిగుడు కొండలు, మైదాన ప్రాంతాలు దాటుకుంటూ.. మధ్యలో మరే మోటార్ల అవసరం లేకుండా 32 కిలోమీటర్ల దూరంలోని మిలియపుట్టి శుద్ధి కేంద్రానికి చేరతాయి. అత్యవసర సమయాల్లో ఉపయోగించడానికి మూడో మోటార్‌ను అదనంగా ఏర్పాటు చేశారు. నీటి తరలింపు మార్గంలో వంశధార నది ఉండటంతో నదీ గర్భంలో దాదాపు అర కిలోమీటర్ మేర పైపు లైన్ నిర్మాణం చేశారు. కొన్ని చోట్ల కొండలను తొలిచి పైప్‌లైన్ వేశారు. ఒక్కసారిగా 73 మీటర్ల ఎత్తుకు.. ఆపై 50 మీటర్లు దిగువకు.. మళ్లీ 147 మీటర్ల ఎత్తున ఉండే కొండపైకి.. మళ్లీ దిగువకు పైప్‌లైన్ నిర్మాణం చేపట్టారు. మరో మాటలో చెప్పాలంటే భగీరథ యత్నమే చేశారు.

కరోనా లేకుంటే ఇప్పటికే అందుబాటులోకి..

ఉద్దానం ప్రాంతంలో కంచిలి, ఇచ్ఛాపురం, కవిటి, సోంపేట, పలాస, వజ్రపుకొత్తూరు, మందస మండలాల్లోని గ్రామాల పరిధిలో కిడ్నీ సమస్య ఉంది. ఈ సమస్యకు అసలు కారణం ఏమిటన్నది ఇంత వరకు స్పష్టంగా నిర్ధారణ కానప్పటికీ.. ఆ ప్రాంత ప్రజలు తాగునీటి అవసరాలకు అక్కడి భూగర్భ జలాలు వినియోగించడం ఒక కారణం కావొచ్చనే నిపుణుల అనుమానాల మేరకే జగన్ ప్రభుత్వం నివారణ చర్యలు మొదలుపెట్టింది. సురక్షిత తాగునీటి సరఫరాకు ఉద్దేశించి ఈ మంచినీటి పథకానికి సీఎం జగన్ 2019 సెప్టెంబర్ 6న శంకుస్థాపన చేశారు. తర్వాతి సంవత్సరంలోనే కరోనా వ్యాప్తి మొదలైంది. ఈ నేపథ్యంలో లాక్‌డౌన్ విధింపు, మరుసటి ఏడాది కూడా రెండో దశ కరోనా వ్యాప్తి కారణంగా ప్రపంచమే స్తంభించిపోయింది. ఈ ప్రభావం మంచినీటి ప్రాజెక్టు, కిడ్నీ రీసెర్చ్ సెంటర్, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల నిర్మాణంపైనా పడింది. ఈ సమస్య లేకుంటే ఇప్పటికే ప్రజలకు అందుబాటులోకి వచ్చి ఉండేది.

బాబు, పవన్.. మాటలతోనే సరి

గత చంద్రబాబు ప్రభుత్వం ఉద్దానం సమస్య పరిష్కారం పూర్తిగా పక్కన పెట్టిందనే చెప్పాలి. 2014లో తెలుగుదేశం అధికారంలోకి వచ్చాక తొలి మూడు సంవత్సరాల పాటు ఈ సమస్యను పరిష్కరించేందుకు ఒక్క చర్యా చేపట్టలేదు. చివరి ఏడాది 2018లో కేంద్ర పరిశోధన సంస్థ ఐసీఎంఆర్, జార్జ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ హెల్త్ సంస్థలతో ఉద్దానం కిడ్నీ సమస్యపై పూర్తి స్థాయి అధ్యయనం చేయిస్తామని ప్రకటించారు. అది కూడా ప్రకటనకే పరిమితమైంది. అప్పట్లో తెలుగుదేశం మిత్రపక్షంగా ఉన్న జనసేన పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ 2018 మే లో ఒకట్రెండు రోజుల పాటు శ్రీకాకుళం జిల్లాలో దీక్షలంటూ హడావుడి చేశారు. ఆ తర్వాత అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబుతో ఒకసారి సమావేశమై ఆ సమస్యను పూర్తిగా వదిలేశారు.

కన్నకొడుకే కాలయముడా..?

- భద్రాద్రి జిల్లా సారపాకలో వ్యక్తి దారుణహత్య
- పెద్దసుత్తితో తలపై కొట్టి చంపిన వైనం
- డ్రగ్స్‌కు బానిసైన కుమారుడిపైనే అనుమానం



రఫీ (ఫైల్)

బూర్గంపాడు: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం సారపాకలో శుక్రవారం అర్ధరాత్రి ఐటీసీలో కాంట్రాక్ట్ కార్మికుడైన సయ్యద్ రఫీ(38) ఇంట్లోనే హత్యకు గురయ్యాడు. ఈ కేసులో రఫీ కుమారుడి(15)పైనే పోలీసులు అనుమానిస్తున్నారు. రఫీకి, భార్య జీనత్‌కు మధ్య కుటుంబ కలహాలున్నాయి. వీరి కుమారుడు 9వ తరగతిలో చదువు మానేశాడు. ఏడాది కాలంగా గంజాయి, డ్రగ్స్‌కు అలవాటు పడి ఇంట్లో తండ్రితో గొడవపడుతుండేవాడు. 15 రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయిన ఆ బాలుడు శుక్రవారం ఉదయం తిరిగి వచ్చాడు. ఇన్ని రోజులు ఎక్కడికెళ్లావని తండ్రి నిలదీయగా, ఇద్దరి మధ్య గొడవ జరిగింది. శుక్రవారం ఐటీసీ డ్యూటీకి వెళ్లి వచ్చిన రఫీ ఇంట్లో నిద్రిస్తుండగా అర్ధరాత్రి సమయంలో అతని కొడుకే పెద్ద సుత్తితో మోది హత్య చేశాడని స్థానికులు అనుమానిస్తున్నారు. పోలీసు జాగిలాలతో నిందితుల కోసం గాలింపు చేపట్టగా హత్యకు ఉపయోగించిన పెద్ద సుత్తి మోతె గ్రామానికి సమీపంలోని అటవీ ప్రాంతంలో లభించింది. అక్కడికి సమీపంలోనే రక్తపు మరకలతో ఉన్న రఫీ కుమారుడు దుస్తులను కూడా పోలీసు జాగిలాలు గుర్తించాయి. దీంతో రఫీ కొడుకును పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. కాగా, తన అన్నను ఆయన కుమారుడు, భార్య కలసి హత్య చేశారని మృతుడి సోదరుడు సయ్యద్ బాజీబాబా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పాల్వంచ డీఎస్పీ వెంకటేష్, సీఐ నాగరాజు, ఎస్సై సంతోష్ ఘటనా స్థలాన్ని పరిశీలించి ఫింగర్ ప్రింట్స్ ఆధారంగా దర్యాప్తు ప్రారంభించారు.

ఖమ్మం మార్కెట్‌లో అగ్నిప్రమాదం


రూ. 41.31 లక్షల విలువైన 1,519 బస్తాల పత్తి దగ్ధం



ఖమ్మం మార్కెట్‌లో దగ్ధమవుతున్న పత్తి నిల్వలు

ఖమ్మం వ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో శనివారం భారీ అగ్ని ప్రమాదం జరిగింది. పత్తి యార్డులోని షెడ్డులో నిల్వ ఉంచిన ఓ ట్రేడర్ గ్రూపునకు చెందిన 1,519 బస్తాల పత్తి ఈ ఘటనలో అగ్నికి ఆహుతైంది. ఈ పత్తి విలువ రూ.41.31 లక్షలు ఉంటుందని అంచనా. శ్రీశివ గణేష్ కృష్ణ ట్రేడర్స్ వ్యాపారి చిత్తూరి శ్రీనివాస్ కొనుగోలు చేసిన 1,809 బస్తాల పత్తిని షెడ్డులో నిల్వ చేయగా శనివారం మధ్యాహ్నం నిప్పంటుకుంది. సిబ్బంది స్పందించి 290 బస్తాలను బయటకు లాగేసినప్పటికీ, 1,519 బస్తాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. పత్తి క్వింటాకు రూ.6,800 చొప్పున లెక్కించి రూ.41,31,680 విలువైన పత్తి అగ్ని ప్రమాదంలో కాలిపోయిందని అధికారులు వెల్లడించారు. షెడ్డులో నిల్వ చేసిన పత్తి బస్తాలకు నిప్పు ఎలా అంటుకున్నదీ తెలియడంలేదు. అగ్ని ప్రమాదం జరిగిన షెడ్డు వైపు సీసీ కెమెరాలు లేకపోవటంతో కారణాలు గుర్తించలేకపోతున్నారు. కాగా, నేలకొండపల్లి నుంచి అగ్నిమాపక యంత్రాన్ని కొద్ది నెలల క్రితం ఖమ్మం మార్కెట్‌కు కేటాయించారు. కానీ మే నెలలో మార్కెట్‌కు వేసవి సెలవులు ప్రకటించగా యంత్రాన్ని తిరిగి నేలకొండపల్లి పంపించారు. ఈనెల 6న మార్కెట్ పునఃప్రారంభమైనా యంత్రాన్ని రప్పించలేదు. ఖమ్మం, నేలకొండపల్లి నుంచి అగ్నిమాపక యంత్రాలు వచ్చేసరికి జరగాల్సిన నష్టం జరిగిపోయింది.

జూరాలలో 8.145 టీఎంసీల నీరు నిల్వ



ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న ఇన్‌ఫ్లోలు పూర్తిగా తగ్గినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. శనివారం ప్రాజెక్టుకు ఎగువ నుంచి ఎలాంటి ఇన్‌ఫ్లోలు లేవని పేర్కొన్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 9.657 టీఎంసీలు కాగా..ప్రస్తుతం 8.145 టీఎంసీల నీరు నిల్వ ఉంది. 157 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

తాగునీటి కోసం 20 క్యూసెక్కులు

మదనాపురం: రామన్‌పాడు జలశయంలో శనివారం పూర్తి నీటిమట్టం 1,018 అడుగుల వరకు నీరు వచ్చి చేరింది. జూరాల ఎడమ కాల్వ, సమాంతర కాల్వకు నీటి విడుదలను నిలిపివేశారు. రామన్‌పాడు నుంచి ఎన్‌టీఆర్ కాల్వకు నీటిని నిలిపివేశారు. తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామని ఏఈ సింగిరెడ్డి రనీల్‌రెడ్డి తెలిపారు.

విద్వేషాలతో కుటుంబవ్యవస్థ చిన్నాభిన్నం



మాట్లాడుతున్న ప్రొఫెసర్ జి.హరగోపాల్

శిక్షా సంఘర్ష్ వేదిక జాతీయ కన్వీనర్ ప్రొఫెసర్ జి. హరగోపాల్

వనపర్తిటౌన్: రాజకీయాలు రోజురోజుకు విద్వేషంగా, క్రూరంగా మారుతుండటంతో ఆ ప్రభావం సమాజంలోని అన్ని కులాలు, మతాలపై పడుతూ చివరకు కుటుంబ వ్యవస్థను చిన్నాభిన్నం చేస్తోందని పౌర హక్కుల నేత, శిక్షా సంఘర్ష్ వేదిక జాతీయ కన్వీనర్ ప్రొఫెసర్ జి.హరగోపాల్ ఆందోళన వ్యక్తం చేశారు. విద్వేష ప్రభావం మహిళలు, దళితులను సైతం వదలడం లేదన్నారు. పాలమూరు అధ్యయన వేదిక ఆధ్వర్యంలో శనివారం జిల్లాకేంద్రంలోని యాదవ భవనంలో జంగిడి బుచ్చన్న యాదిలో జీవనరేఖలు పుస్తక ఆవిష్కరణ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ పదేళ్లుగా ద్వేషించే రాజకీయాలు విపరీతంగా పెరిగిపోవడం బాధకరమన్నారు. మానవ సంబంధాలు సంక్షోభంలో పడిపోతున్నాయన్నారు. కుటుంబాన్ని ప్రేమించలేని వ్యక్తి సమాజాన్ని, ప్రజలను ప్రేమించలేడన్నారు. కుటుంబాలు, సమాజం మానవీయంగా మారాల్సిన అవసరం ఉందన్నారు. సమాజంలో మనిషి క్రూరంగా మారేందుకు ద్వేషమే కారణమని, ఆ ద్వేషంతో విచక్షణరహితంగా మారుతున్నారని ఇందుకు ప్రసార సాధనాల్లో వస్తున్న కథనాలే నిదర్శనమన్నారు. ప్రేమించేతత్వం సమాజానికి నేర్పకుంటే రాబోయే జనరేషన్ పరిస్థితి ఏంటని తలుచుకుంటేనే భయాందోళన కలుగుతోందన్నారు. సమాజంలో అక్కడక్కడ ఉన్న మంచి, మానవీయమైన వ్యక్తుల చరిత్ర ఉపశమనం కలిగిస్తోందని చెప్పారు. మానవీయ విలువలను పునరుద్ధరించేందుకు సమాజం చొరవ చూపాలన్నారు. కుటుంబ వ్యవస్థలు పదిలంగా ఉంటేనే సమాజం బలపడుతుందన్నారు. కుటుంబ వ్యవస్థతోనే విలువలు మనుషుల్లో పెంపొందాల్సిన అవసరం ఉందని, తద్వారా సమసమాజ నిర్మాణం రూపుదిద్దుకుంటుందన్నారు. వనపర్తిలో డాక్టర్ బాలకృష్ణయ్య ప్రజలకు విశేషంగా సేవలందించారని గుర్తు చేసుకున్నారు. వనపర్తి చైతన్యం కలిగిన ప్రాంతమని ఈ ప్రాంతంలో ప్రజాస్వామిక విలువలకు పెద్దపీట వేస్తారని చెప్పారు. పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ రాఘవాచారి మాట్లాడుతూ ఆర్థికంగా, సామాజికంగా, పెట్టుబడి దారికి వ్యతిరేకంగా ప్రజా సంఘాల పోరాటం ఉంటుందని, గతంలో చేసిన పోరాటాలకు, 2020 దశకంలో చేస్తున్న పోరాటాలకు ఎంతో వ్యత్యాసం ఉందన్నారు. మాజీ మంత్రి చిన్నారెడ్డి మాట్లాడుతూ ఒకరి కోసం కాకుండా సమాజం కోసం ఆలోచించే వ్యక్తులను గుర్తుచేసుకోవడం శుభపరిణామమన్నారు. అంతకుముందు జంగిడి బుచ్చన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పాలమూరు అధ్యయన వేదిక, సంఘాల ప్రతినిధులు శాంతన్న, ఐ.నారాయణ, వెంకటేశ్వర్లు, జనజ్వాల, యోసేపు, వేణుగోపాల్, రాజారామ్‌ప్రకాశ్ పాల్గొన్నారు.

దివ్యాంగుల సంక్షేమానికి బీఆర్‌ఎస్ కృషి



సీఎం కేసీఆర్, మంత్రి శ్రీనివాస్‌గౌడ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న దివ్యాంగులు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): దివ్యాంగులు సైతం సమాజంలో భాగమని, బీఆర్‌ఎస్ ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమానికి కట్టుబడి ఉందని రాష్ట్ర ఎక్సైజ్, క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. సమైక్య రాష్ట్రంలో దివ్యాంగుల కష్టాలు అన్నీ ఇన్నీ కావని, అయినప్పటికీ వారిని పట్టించుకున్న పాపాన పోలేదని విమర్శించారు. సీఎం కేసీఆర్ దివ్యాంగుల పింఛన్‌ను రూ.4,016కు పెంచుతున్నట్లు ప్రకటించడంతో శనివారం కలెక్టరేట్ ఆవరణలో దివ్యాంగులు సీఎం కేసీఆర్, మంత్రి శ్రీనివాస్‌గౌడ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశానికి తెలంగాణ రాష్ట్రం ఆదర్శంగా నిలిచిందని, అన్నిరంగాల్లో అగ్రగామిగా దూసుకెళ్తోందన్నారు. ఒకప్పుడు విద్యుత్, సాగునీరు లేక ఇబ్బందులు పడ్డారని, ఇప్పుడు అలాంటి పరిస్థితి ఏమాత్రం లేదన్నారు. దివ్యాంగుల భవన్ ఏర్పాటు కోసం స్థలం ఇస్తామని, అలాగే దివ్యాంగుల సమస్యలను తీరుస్తామని మంత్రి పేర్కొన్నారు. అనంతరం మంత్రి దివ్యాంగులతో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో కలెక్టర్ రవినాయక్, ఎస్పీ కె.నరసింహ, మున్సిపల్ చైర్మన్ నర్సింహులు, దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు నివాసులు, మహిళా అధ్యక్షురాలు యాదమ్మ, ఉపాధ్యక్షుడు రవి కుమార్, ప్రధాన కార్యదర్శి అంజయ్య, నర్సింహులు, యాదయ్య, కృష్ణ, నరేందర్, శంకర్‌నాయక్, మధు తదితరులు పాల్గొన్నారు.

రాజీపడకుండా పట్టుదలకు వెళ్లకండి



మాట్లాడుతున్న న్యాయమూర్తి బోయ శ్రీనివాసులు


ఇన్‌చార్జ్ న్యాయమూర్తి శ్రీనివాసులు

పాలమూరు: కోర్టులలో కేసులు పరిష్కారం కావడానికి సమయం పడుతుందని, ఇలాంటి సందర్భంలో సమస్య పరిష్కరించుకోవడానికి ఏర్పాటు చేసిన లోక్ అదాలత్ ద్వారా రాజీ కావాలని జిల్లా కోర్టు ఇన్‌చార్జ్ న్యాయమూర్తి బోయ శ్రీనివాస్ అన్నారు. రాజీ అయ్యే కేసులలో రాజీ కాకుండా పట్టుదలకు వెళ్తే దాని పర్యావసనాలు ఆయా కుటుంబంలోని పిల్లలపై చూపుతాయన్నారు. జిల్లా కోర్టు ఆవరణలోని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని న్యాయమూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో ఆస్తి పంపకాల వ్యవహారంలో అన్నదమ్ముల మధ్య ఏర్పడుతున్న ఆస్తి గొడవల కారణంగా ఒకరి ఫంక్షన్‌కు మరొకరు వెళ్లలేని ఘటనలు కనిపిస్తున్నాయని అన్నారు. కుటుంబంలో ఏదైనా సమస్య వస్తే బంధువుల సమక్షంలో లేదా న్యాయవాది సమక్షంలో పరిష్కరించుకోవాలని సూచించారు. న్యాయవాది అయితే భవిష్యత్‌లో ఎలాంటి ఇబ్బంది రాకుండా సమస్యకు పరిష్కారం చూపుతారన్నారు. అనంతరం కోర్టు ఆవరణలో ఏర్పాటు చేసిన ఆరు ప్రత్యేక బెంచీలలో న్యాయమూర్తులు కేసులు పరిశీలించి ఇరువురికి రాజీ చేయడం జరిగింది. కార్యక్రమంలో న్యాయమూర్తులు శ్రీదేవి, చంద్రకళ, వై.పద్మ, ఎంకే పద్మావతి, చిరంజి ఆశలత, ఎస్.శ్రీదేవి, హరికుమార్, నిహారిక, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా జిల్లావ్యాప్తంగా 3,041 కేసులు పరిష్కరించినట్లు సంబంధిత అధికారులు తెలిపారు.

నిరుద్యోగులతో చెలగాటమాడితే సహించం

గద్వాల జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో సంపత్‌కుమార్, బల్మూరి వెంకట్

గద్వాల అర్బన్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాల పేరిట ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ, ప్రజాధనాన్ని వృథా చేస్తోందని ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, ఎన్‌ఎస్‌యూఐ అధ్యక్షుడు బల్మూరి వెంకట్ అన్నారు. శనివారం జిల్లాకేంద్రంలోని టీఎన్‌జీఓ భవనంలో ఎన్‌ఎస్‌యూఐ జిల్లా విస్తృత స్థాయి సమావేశానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి, సంక్షేమం, విద్యావ్యవస్థకు పెద్దపీట సాధ్యమన్నారు. విద్యార్థుల సమస్యలపై ఎన్‌ఎస్‌యూఐ నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడితే సహించేది లేదని, ఎక్కడికక్కడే ఎమ్మెల్యేలను అడ్డుకొని నిలదీస్తామని హెచ్చరించారు. రాష్ట్రంలో నియంత పాలన కొనసాగుతుందని, విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యలను గాలికొదిలేసి దశాబ్ది ఉత్సవాలు నిర్వహించడం సిగ్గుచేటన్నారు. అనంతరం ఈ నెల 18న జరిగే రాజీవ్‌గాంధీ ఆన్‌లైన్ క్విజ్ పోటీలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. సమావేశంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజీవ్‌రెడ్డి, ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, నాయకులు వీరుబాబు, రఘునాయుడు, రవి, శివరాజ్, ప్రసాద్, జమాల్ తదితరులు పాల్గొన్నారు.



వనపర్తిలో మాట్లాడుతున్న బల్మూరి వెంకట్

సమస్య ఏదైనా 24 గంటల్లో స్పందిస్తాం

వనపర్తిటౌన్: రాష్ట్రం నలుమూలల నుంచి సమస్య ఏదైనా తమ దృష్టికి తెస్తే 24 గంటల్లో స్పందిస్తామని బల్మూరి వెంకట్ అన్నారు. ఇందుకోసం ప్రతి మండలానికి ఒక హెల్ప్‌లైన్ నంబర్ ఏర్పాటు చేసి, విద్యార్థుల సమస్యల పరిష్కారం దిశగా కృషి చేస్తామన్నారు. జిల్లాకేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్‌ను తెలంగాణ నుంచి తరిమికొట్టే సమయం ఆసన్నమైందన్నారు. పీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ చిన్నారెడ్డి మాట్లాడుతూ రూ.వెయ్యి కోట్లతో బీఆర్ఎస్ పార్టీ ప్రచారానికి వాడుకుంటుందని మండిపడ్డారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక నిజమైన దశాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. అంతకుముందు ఎన్‌ఎస్‌యూఐ ఆధ్వర్యంలో వివిధ కళాశాలలలో జరిగిన క్విజ్ పోటీలను పరిశీలించారు. కార్యక్రమంలో నాయకులు రాజేంద్రప్రసాద్, కిరణ్‌కుమార్, రోహిత్, అనుదీప్, విష్ణువర్ధన్‌రెడ్డి, రాములు, మన్యంకొండ తదితరులు పాల్గొన్నారు.

'పాలమూరు'పై పచ్చి అబద్ధాలు

సాక్షి, నాగర్‌కర్నూల్: పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుపై సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి విమర్శించారు. శనివారం జిల్లాకేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పాలమూరు ప్రాజెక్టు ఇప్పటికే 90 శాతం పూర్తయిందని మంత్రి కేటీఆర్ చెబుతున్నారని, కానీ ప్రభుత్వం సుప్రీంకోర్టుకు పోయి సాధించింది కేవలం 7 టీఎంసీలు మాత్రమేనని చెప్పారు. ఎలాంటి డిస్ట్రిబ్యూటరీ కాల్వలు లేకుండా కేవలం రిజర్వాయర్లతోనే పంటలకు నీరందిస్తారా? అని ప్రశ్నించారు. తండ్రీకొడుకులు ఇద్దరూ అబద్ధపు వాగ్దానాలతో ప్రజలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. ధరణి లేకపోతే రైతులకు డబ్బులే రావని సీఎం కేసీఆర్ పదేపదే చెబుతున్నారని, 2018 ఎన్నికల ముందు రైతుబంధు డబ్బులు వేసినప్పుడు ధరణి ఎక్కడుందో చెప్పాలన్నారు. తప్పులతడకగా రూపొందించిన ధరణితో ఊరికి వందమందికిపైగా ఇబ్బందిపడుతున్నారని చెప్పారు. డబుల్ బెడ్రూం ఇళ్లను నిర్మించని గ్రామాల్లో ఓటుహక్కు అడిగే అర్హత బీఆర్‌ఎస్‌కు లేదన్నారు. ప్రభుత్వం ఇచ్చే రూ.3లక్షలతో బేస్‌మెంట్ కూడా పూర్తయ్యే పరిస్థితి లేదని విమర్శించారు. తాను నాగర్‌కర్నూల్‌కు సీఈవోనంటున్న ఎమ్మెల్యే దాని అర్థం ఏమిటో చెప్పాలన్నారు. సత్య నాదెళ్లతో ఆయన్ను పోల్చుకోవడం విడ్డూరంగా ఉందని చెప్పారు. ఈ ప్రాంత సమస్యలపై ఒక్కనాడైనా అసెంబ్లీలో నోరు తెరిచాడా? అని ప్రశ్నించారు. ఎమ్మెల్యే జనార్దన్‌రెడ్డి తెలంగాణ ఉద్యమంలో ఏనాడూ పోరాటం చేయలేదని, ఇటువంటి వారినే సీఎం కేసీఆర్ పక్కన చేర్చుకుని దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. స్థానిక ఎమ్మెల్యే అవినీతి బాగోతాలను ఆధారాలతో సహా బయటపెట్టి జైలుకు పంపిస్తామని పేర్కొన్నారు. కాంగ్రెస్ నేతలు అర్థం రవి, లక్మయ్య, పాండు తదితరులు పాల్గొన్నారు.



మేడిపూర్ శివారులోని ఇసుక డంపును పరిశీలిస్తున్న మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి

ఆయన చెప్పినట్టే అధికారులు నడవాలట..

నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో అక్రమ ఇసుక, నల్లమట్టి దోపిడీకి అడ్డులేకుండా పోయిందని నాగం విమర్శించారు. తాడూరు మండలం మేడిపూర్ శివారులో దుందుబీ తీరం వెంబడి కొనసాగుతున్న ఇసుక తవ్వకాలను గ్రామస్తులు అడ్డుకున్నారు. ఘటన స్థలానికి చేరుకున్న ఆయన మేడిపూర్ శివారులోని పంటపొలాల్లో పెద్దఎత్తున డంపు చేసిన ఇసుక నిల్వలను పరిశీలించారు. నాగర్‌కర్నూల్ నియోజకవర్గానికి కొత్తగా సీఈఓ వచ్చారని, ఆయన చెప్పినట్టుగానే అధికారులంతా నడుచుకుంటున్నారని చెప్పారు. మేడిపూర్ చుట్టుపక్కల సుమారు 30 చోట్ల ఇసుక డంపులను ఏర్పాటు చేసుకుని పదుల సంఖ్యలో టిప్పర్లతో అక్రమంగా తరలిస్తున్నారని చెప్పారు.